ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 19-4-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో ఉన్న పరమేశ్వరుని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి గురువుయొక్క అనుగ్రహం ఎలా సహకరిస్తుంది అని అడుగుతున్నారు. గురువు అంటే ఆత్మ. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు వేరు, గురువు వేరు కాదు. నీ హృదయంలో మరణంలేని వస్తువు ఒకటి ఉంది. అదే గురువు, అదే ఈశ్వరుడు, అదే ఆత్మ. పేర్లు వేరుగాని ఉన్నది ఒక్కటే. మన మనస్సును పవిత్రం చేసి ఆ సద్వస్తువును తెలుసుకొనేటట్లు మనలను అనుగ్రహించటంకోసం మనలోపల ఉన్న ఆ సద్వస్తువే కాళ్ళు, చేతులు తొడుక్కొని బాహ్యంగా రూపం ధరించి వస్తుంది. మన శరీరాలు అన్నీ బొమ్మలే. మాంసంతో తయారుచేస్తారు. మనకు నామదృష్టి, రూపదృష్టి ఉంది. రూపదృష్టికి, నామ దృష్టికి అతీతమైనది సద్వస్తువు. బాహ్యంగా ఎందుకు రూపం ధరించి వస్తుందంటే నిజమైన వస్తువును తెలియజేయటంకోసం మనకు బోధ చేసి, మనలను పవిత్రం చేసి, మనస్సులో ఉన్న దోషములను తొలగించి మన మనస్సును అంతర్ముఖం చేయటానికి బాహ్యమైన గురువు సహకరిస్తాడు.

అన్నీ తలంపులే. గురువు అనుగ్రహంమాత్రం తలంపు కాదు. నీలోపల ఉన్న సద్వస్తువు తలంపుకాదు. నీకు తలంపులు లేకపోయినా సద్వస్తువు ఉంటుంది. నేను అనే తలంపు, ఇతర తలంపులు అణిగిపోయినటువంటి గాఢనిద్ర స్థితిలో మనం హాయిగా ఉన్నాము. రాగము, ద్వేషము, కామము, క్రోధము ఏ మనస్సులో అయితే పుడుతున్నాయో ఆ మనస్సు గాఢనిద్రలో అణిగిపోయి ఉంటుంది. కామక్రోధములకు ఉనికి అయిన మనస్సు అణిగిపోయినపుడు కామక్రోధములుకూడా అణిగిపోతాయి. ఈశ్వరుడు చేయలేని ఉపకారం గురువు చేస్తాడు. మనం చేసేపనికి అంటే మనం చేసే పుణ్యపాపములకు ఫలితం ఇస్తాడు ఈశ్వరుడు. ఈ పుణ్యపాపములకు కారణమైన మనస్సును అణచి సద్వస్తువుదగరకు తీసుకొని వెళ్ళటానికి గురువు సహకరిస్తాడు. అంటే ఈశ్వరుడు చేయలేని పనిని గురువు చేస్తాడు. ఈశ్వరుడు కర్మ ఫలితాన్ని ఇస్తాడు కాని గురువు అలాకాదు నిన్ను నీమూలంలోనికి తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నం చేస్తాడు.

మనలో ఒక్క వాసనే ఉంది అనుకోండి. దానివలన జన్మ వచ్చింది అనుకోండి. మరల ఆ జన్మలో కొత్తవాసనలు ప్రోగు చేసుకొని కొన్ని వేల జన్మలకు బీజములు వేసుకోవచ్చును. ఏ శరీరములో ఉండగా వాడికి ఉన్న వాసనలు నిశ్శేషంగా నశించాయో అప్పుడు వాడు పునర్జన్మలేని స్థితికి ఎదుగుతాడు. ఒక్కవాసన ఉన్నప్పటికీ అది కొన్నివేల జన్మలకు దారి తీయవచ్చు. అందువలన మనం బహుజాగ్రత్తగా ఉండాలి. ఈ జన్మలను కోరుకొనేవాడు, భోగాలను అనుభవించేవాడు, ఇతర లోకాలకు ప్రయాణం చేసేవాడు ఇవి అన్నీ జీవుడే కాబట్టి ఆ జీవలక్షణాలను తొలగించి, జీవుడు పల్చబడేటట్లు చేసి, ఆ జీవుడు తనమూలంలోనికి వెళ్ళి కరిగిపోయేలా చేసేవాడు గురువుమాత్రమే. నీ మనస్సును ఏవిధంగా పవిత్రం చేయాలో బాహ్యగురువు చూస్తాడు. మీరు కంగారు పడకూడదు. మనస్సు ఒక్కసారే పవిత్రం అవ్వదు. టైము చూసుకొని నెమ్మదిగా చేసుకొంటూ వెళతాడు. ఎప్పుడు ఏ విధంగా నీ మనస్సుకు turning ఇవ్వాలో, వాసనలను ఎప్పుడు తొలగించటానికి అవకాశం ఉందో చూసుకొని నెమ్మదిగా, నిదానంగా చేసుకొంటు వస్తాడు గురువు. నీ దేహాలు మారినా, పరిసరాలు మారినా, కుటుంబాలు మారినా ఆయన స్వరూపం నీకు తెలిసేవరకూ

జన్మజన్మలకు నీకూడా వచ్చి ఆ స్వరూపము నీకు అందేవరకూ గురువు నిన్ను విడిచిపెట్టడు. ఒకేసారి నీకు జ్ఞానం ఇవ్వలేక కాదు. నీ మనస్సును నెమ్మదిగా పవిత్రం చేస్తాడు. ప్రతీజన్మలోనూ నీకూడా ఉంటాడు. నీ మనస్సు పవిత్రం అయిన వెంటనే దానిని దాని మూలంలోనికి నెట్టుతాడు. గురువు అనుగ్రహం అనేది తలంపుకాదు. అది సజీవమైన సత్యం. గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. ఆయనమీద ప్రేమ, ధృఢమైన విశ్వాసం కలుగచేయటంకోసం ఒకోసారి మీకోరికలనుకూడా నెరవేరుస్తాడు. గురువు అనుగ్రహాన్ని తక్కువ అంచనా వేయటానికి వీలులేదు. గురువుయొక్క అనుగ్రహం లేకుండా గురువుయొక్క స్వరూపాన్ని మనం పొందలేము. మీ కంటిని రెప్ప ఏవిధంగా అయితే కాపాడుతోందో మీ గురువు మిమ్మలను ఆ విధంగా కాపాడుతూ ఉంటాడు.

గురువు భోద వినటంవలన బ్రహ్మానుభవం కలగటానికి తగిన శక్తి నీ మనస్సుకు కలుగుతుంది. మనస్సుకు ఏకాగ్రత, పవిత్రత, స్థిరత్వం, శాంతి కలుగుతుంది. ఈ భౌతికమైన జీవితానికి, ప్రాపంచిక జీవితానికి మనం అంటిపెట్టుకొని ఉండేటట్లు ఏ వాసనలు అయితే చేస్తున్నాయో ఆ వాసనలను తొలగించటానికి గురువు చూస్తాడు. గురువు బోధిస్తూ ఉంటాడు, ప్రేమిస్తూ ఉంటాడు, అనుగ్రహిస్తూ ఉంటాడు. ఆయనయందు నమ్మకం కలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. ఆయనయందు నమ్మకం కలిగాక పారమార్థిక స్థితిగురించి ఉపదేశించటం ప్రారంభిస్తాడు. ఉపదేశించి వదిలివేయటంకాదు ఆయన బోధించేబోధ నీకు అనుభవంలోనికి రావటానికి ఏ సంస్కారములు అయితే అడ్డువస్తున్నాయో ఆ సంస్కారములను తొలగించే బాధ్యతకూడా గురువే పెట్టుకొంటాడు. మనదేహంకంటే, ఇంద్రియాలకంటే సత్యం అత్యంత సమీపంలో ఉంది. ఆ సత్యాన్ని మీకు బోధించటమేకాదు ఆ సత్యం మీకు అనుభవంలోనికి వచ్చేవరకూ గురువు మిమ్మలను విడిచిపెట్టడు. మీరు శరీరం విడిచిపెట్టి కొత్తశరీరంలోనికి వెళ్ళినప్పటికీ మీరు ఏ దేహంలో ఉన్నారో గురువు చూసుకొంటూ ఉంటాడు. పూర్వజన్మలో మీరు ఎంతవరకూ సాధన చేసారో చూసి మీ చేయిపట్టుకొని మీచేత సాధన చేయిస్తాడు. గురువు అనుగ్రహం మీకు కనిపించవచ్చు, కనబడకపోవచ్చు. గురువు అనుగ్రహం కనపడని సంకెళ్ళులాంటిది. మన మనస్సును కట్టేసి ఆ మనస్సులో ఉన్న దోషాన్ని పిండేసి, మనస్సును సూక్ష్మం చేసి, అది హృదయంలో నిలబడి ఉండేటట్లు చేసి మనస్సు హృదయంలో పూర్తిగా కరిగిపోయేవరకూ గురువు బాధ్యత పెట్టుకొంటాడు. గురువు అనుగ్రహం అంటే అది.

బ్రహ్మం ఎంత పవిత్రమైనదో ఈ జీవుడుకూడా అంత పవిత్రం అయితే తప్పనిసరిగా బ్రహ్మం తన స్వరూపమును ఇస్తుంది. పూజచేయమని చెప్పినా, జపం చేయమని చెప్పినా జీవుడిని పవిత్రం చేయటంకోసమే. ఏ విషయాలమీద నీ మనస్సు ఎక్కువగా వాలుతోందో గురువు చూసి ఆ విషయములనుండి నీ మనస్సును విడదీస్తాడు. శంకరాచార్యులు ఈ ప్రపంచం అసత్యం అని ఎందుకు చెప్పారు అంటే ఈ ప్రపంచం అసత్యం అనుకొంటేగాని నీ మనస్సు అంతర్ముఖం కాదు. ఈ ప్రపంచం నిజం అనుకొంటే నీ మనస్సు ఏదో రూపంలో బయటకు వచ్చేస్తుంది. ఏ జ్ఞాని చెప్పినా నీమనస్సును అంతర్ముఖం చేయటానికే. ఎవడైతే నీ మనస్సును అంతర్ముఖపరుస్తున్నాడో వాడే గురువు. నీ మనస్సును అంతర్ముఖం చేయనివాడు గురువు కాదు వాడు రాక్షసుడు అని భగవాన్ చెప్పారు. మనస్సు హృదయంలో ఎంత ఎక్కువకాలం నిలబడితే అంత మంచిది. అప్పుడు ధ్యానస్థితి కుదురుతుంది. అప్పుడు అది తొందరగా కరిగిపోతుంది. అలవాటును సంతృప్తి పరిస్తే అది పెరిగిపోతుంది. అలవాటును కంట్రోలు చేస్తే అది కరిగిపోతుంది. నీ అలవాట్లలోనుండి నీ మనస్సును విడుదల చేస్తేనేగాని అది సూక్ష్మం కాదు. నీ మనస్సును సూక్ష్మం చేస్తేనేగాని అది అంతర్ముఖం కాదు. బుద్ధిసూక్ష్మత ఉంటేగాని సత్యాన్వేషణ చేయలేడు. ఆ సూక్ష్మబుద్ధినికూడా గురువే కలుగజేస్తాడు. బాహ్యగురువు నీకు సత్యాన్ని భోదిస్తాడు. నిన్ను గాలిలో విడిచిపెట్టడు. నీకు ఆలంబనగా ఉంటాడు. నీకు విషయం అర్ధమయ్యేలాగ చెపుతాడు. ఎంతకాలం చెపుతాడు అంటే, ఎన్ని జన్మలు చెపుతాడు అంటే నీ బుర్రకు పట్టేవరకూ చెపుతూనే ఉంటాడు. నీ స్వరూపం నీకు అనుభవంలోనికి

వచ్చేవరకూ గురువు విడిచిపెట్టడు. వాడే నిజమైన గురువు.

నీ హృదయంలో ఉన్న నిజం తలంపుకాదు. అది తలంపు కాదు కాబట్టి తలంపులు అన్నీ అణిగిపోయినపుడు కూడా అది ఉంటోంది. గురువు చేసే పని ఏమిటి అంటే ఆ నిజంలోనికి నీ కళ్ళు తెరిపించటానికి ప్రయత్నం చేస్తాడు. ఆ నిజంలో జన్మించటమే నిజమైన పునర్జన్మ. అప్పుడు జననమరణ ప్రవాహంలోనుండి, సంసారంలోనుండి బయటకు వస్తావు. మనకు ఉన్న దేహబుద్ధిని పోగొట్టటంకోసం బాహ్యంగా తన సహాయం అందించటంకోసం గురువు దేహం ధరించి వస్తాడు. గురువు దేహం ధరించి వచ్చినా ఆ రూపంగాని, ఆ రూపానికి పెట్టిన పేరుగాని తానుకాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది.

నీ మనస్సు ఎంత ఆందోళనగా ఉన్నా, చిరాకుగా ఉన్నా, అశాంతిగా ఉన్నా, గాబరాగా ఉన్నా వాటిలోనుండి విడదీసి నీ మనస్సుకు కొంచము శాంతిని కలుగజేస్తాడు గురువు. అంతేగాని మీకు శాంతి కలుగుతోంది అనుకోండి అది మీ తెలివితేటలవలన కాదు. మీకు ఎప్పుడైనా శాంతి కలుగుతూ ఉంటే అది మీ తెలివితేటలవలన అనుకోకండి, గురువు అనుగ్రహం వలననే కలుగుతోంది. మనస్సును అణిచిపెట్టి ఉంచటానికి మీతెలివితేటలు సరిపోవు. మీ మనస్సుకు శాంతి, చల్లదనం కలుగుతోంది అంటే అదీ గురువు అనుగ్రహంవలననే వస్తోంది.

బయట గురువు నీ మనస్సును prepare చేసి, fit చేస్తాడు. నీ మనస్సు fit అయిన తరువాత లోపల ఉన్న గురువు మనస్సును లోపలకు లాగి తన స్వరూపమును ఇస్తాడు. లోపల ఉన్న గురువు, బయట ఉన్న గురువు వేరుకాదు. ఉన్నది ఒక్కటే వస్తువు. ఆ వస్తువే బయట గురురూపం ధరించి వస్తుంది. మీకు శాంతి సహజం అయ్యేవరకూ, శాశ్వతం అయ్యేవరకూ బయట గురువుగాని, లోపల ఉన్న గురువుగాని నిన్ను విడిచిపెట్టరు. అదీ గురువు అనుగ్రహం అంటే. మనకు వాసనలతో, అజ్ఞానంతో ఉన్న సాంగత్యమును ఊడగొట్టే బాధ్యతను గురువే పెట్టుకొంటాడు. నీకు ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, గౌరవం ఉండవచ్చు. వీటితో తాదాప్యంవలన మనం అపవిత్రులం అవుతున్నాము. విషయాన్ని అర్థంచేసుకోండి. రోజూ కాళ్ళు, చేతులు బాడీచేసుకొని ఎన్నాళ్ళు ఇలా కడుక్కొంటూ ఉంటారు. చదువు, డబ్బు, గౌరవం వీటితో తాదాప్యంవలన అపవిత్రులమవుతున్నాము. మరల అందులోనుండి బయటపడటానికి పూజలు, జపాలు, ధ్యానాలు మొదలుపెడుతున్నాము. డబ్బు, చదువు, గౌరవం ఇవి అన్నీ నీదేహం ఎంత నిజమో ఇవి అన్నీకూడా అంతే నిజం. వాటితో తాదాప్యంవలన నీవు అపవిత్రుడవు అవుతున్నావు. ఇటువంటి విషయాలు బోధించటానికి గురువు రూపం ధరించి వస్తాడు. దేహబుద్ధి నశిస్తే ఈ విషయాలు నశిస్తాయి. దేహబుద్ధి నశించిన వెంటనే ఆత్మబుద్ధి కలుగుతుంది. ఆత్మలో ఉన్నది శాంతి, సుఖం కాబట్టి అది నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అదే చివరిస్థితి. సొంతంగా ఆలోచించటం నేర్చుకోండి. ఆలోచన అమృతంతో సమానము. మనలను ఉద్రేకపరిచేవారు ఎక్కువగా ఉంటారు కాని మనలను ఆలోచింపచేసేవారు ఎంతమంది ఉన్నారు. ఎవరైతే మనలను ఆలోచింపచేస్తారో వారే మన హితవుకోరేవారు, వారే మన చైతన్య సాయిని పెంచేవారు. మానవులు అనేక రకములైన ఆధ్యాత్మిక సాధనలు చేస్తున్నారు దానియొక్క చివరి స్థితి ఏమిటి అని అడుగుతున్నారు. నీ స్వరూపమును నీవు తెలుసుకోవటమే చివరిస్థితి. నీ స్వరూపంలో సుఖం ఉంది. నీ స్వరూపం ఎప్పుడైతే తెలిసిందో ఆ సుఖం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అది ఆధ్యాత్మిక సాధనల చివరిస్థితి.

కొంతమంది సత్య వస్తువును పొందటంకోసం పెళ్ళిచేసుకోవటం లేదు, తపస్సులు చేస్తున్నారు. ఇల్లువిడిచిపెట్టి వెళుతున్నారు. సన్యాసులకంటే గృహస్థులు ఎక్కువకదా. గృహస్థులుకూడా ఆత్మానుభవం పొందటానికి అవకాశం ఉందా అని అడుగుతున్నారు. గృహస్థులుకూడా బ్రహ్మానుభవం పొందవచ్చు. ఇందులో ఏమీ సందేహం లేదు అని భగవాన్ చెపుతున్నారు. సన్యాసి నేను సన్యాసిని అనుకొంటాడు, గృహస్థుడు నేను గృహస్థుడను అనుకొంటాడు. అది తలంపే. ఇదీ తలంపే. ఇద్దరికీ నిజం తెలియదు. నీవు వివాహం

చేసుకొన్నావా, చేసుకోలేదా అన్నది ముఖ్యం కాదు. నీవు ఎంతవరకూ పవిత్రుడవు అయ్యావు, ఎంతవరకూ fit అయ్యావు, ఎంతవరకూ నీకు యోగ్యత ఉంది అన్నది ముఖ్యంగాని నీవు గృహస్థాశ్రమంలో ఉన్నావా, నీవు సన్యాసివా అని భగవంతుడు చూడడు. బ్రహ్మం ఎక్కడో లేదు, ఎప్పుడో లేదు. బ్రహ్మం ఇక్కడే ఉంది, ఇప్పుడే ఉంది, అంతటా ఉంది. అంతటా ఉన్న వస్తువును తెలుసుకోవటానికి వివాహం చేసుకోవటం, చేసుకోకపోవటంతో ఏమీ సంబంధంలేదు. నీకు అర్హత ఉందా లేదా అని చూస్తుందిగాని అది నీ వయస్సును చూడదు, నీ sex చూడదు, నీ caste చూడదు. నీవు fit అయ్యావా లేదా అని చూస్తుంది. నీవు fit అయితే వెంటనే అది reveal అవుతుంది. బ్రహ్మం ఇక్కడ లేదు. ఎప్పుడో దేహం చనిపోయిన తరువాత తెలుసుకొనే వస్తువు అది అని అనుకొంటున్నావు అనుకో ఆ తలంపే నీకు బ్రహ్మానుభవం రాకుండా అడ్డువస్తుంది. నువ్వు దేహం మరణించేవరకూ ఆగనక్కరలేదు. అది ఇప్పుడే ఇక్కడే పొందవచ్చు. అది నీకు reveal అవ్వటానికి సిద్ధంగా ఉంది. ఆ వస్తువును ఎప్పుడు తెలుసుకొందామా, ఎప్పుడు సుఖపడదామా అని నీవు ఏవిధంగా తంటాలు పడుతున్నావో వీరిక్కి ఎప్పుడు ఎరుకపడదామా అని ఆ వస్తువు నీకు ఎరుకపడటానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ లేదు అనుకో. ఒక కాలంలో ఉండి మరో కాలంలో లేదు అనుకో నీవు సాధన చేసి అటువంటి వస్తువును తెలుసుకోవలసిన పనిలేదు. అంతటా ఉన్న వస్తువును అన్నికాలములలో ఉన్న వస్తువును తెలుసుకొంటే నీవు సుఖపడతావుగాని ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేని వస్తువును తెలుసుకొన్నా నీవు సుఖపడలేవు. అటువంటి వస్తువును తెలుసుకోవలసిన అవసరం నీకు లేదు. నీ తలంపులు ఎంత నిజమో అవికూడా అంతే నిజం. జీవితంలో నటించవద్దు. కృత్రిమంగా ఉండ వద్దు. ఆ వస్తువు కృత్రిమంగా లేదు. అందువలన నీవు కృత్రిమంగా ఉంటే ఆ వస్తువు నీకు తెలియదు.

మీరు చేసే పనే ప్రీతితో, శ్రద్ధతో చేస్తే అదే దేవునికి పెట్టే నిజమైన నమస్కారము. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు, మంచంమీదనుండి లేవలేనివారు ఉన్నారు అనుకోండి వారు మీపట్ల సదభిప్రాయంతో లేకపోయినా మీరు సహృదయంతో సేవచేస్తున్నారు అనుకోండి అప్పుడు దేవుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. ఆసక్తి లేకుండా ప్రేమ పూరితంగా పనిచేస్తే అదికూడా ధ్యానంతో సమానం. ధ్యానం చేస్తే ఏ ఫలితం వస్తుందో ఆసక్తిలేకుండా చేసే పనివలనకూడా అదే ఫలితం వస్తుంది. పనిదొంగలుగా ఉండకూడదు. పనిద్వారా మీరు దేవుని పూజించండి. మీపూజను పెదాలకు, చేతులకు సరిపెట్టేస్తున్నారు. పనిచేయటంద్వారా కూడా దేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు.

జపం చేసుకోవటానికి, తపస్సు చేసుకోవటానికి ఇల్లువిడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళమంటారా అని అడుగుతున్నారు. టైముకు ఇంటిదగ్గర కాఫీత్రాగి, భోజనం చేసి సాధన చేయలేనపుడు ఎక్కడికో వెళ్ళి టైముకు కాఫీ, భోజనం దొరకనపుడు నీవు సాధన ఏమిచేయగలవు. నీ ఇంటిదగ్గరే ఉండి నీపని చేసుకొంటూ సాధనచేయవచ్చు అంటున్నారు భగవాన్. అప్పుడు మీరుమాత్రం ఇల్లువిడిచిపెట్టి వచ్చివేయవచ్చు, మేము ఇల్లువిడిచిపెట్టకూడదా అని అడుగుతున్నాడు. అప్పుడు భగవాన్ నేను అరుణాచలం ఎలా వచ్చానో చెప్పమంటావా ఒక మహా ప్రవాహంలో గడ్డిపరక ఎంతవేగంగా కొట్టుకొని వస్తుందో అలాగ అరుణాచలం వచ్చాను. స్నేహితులను అడుగుదామా, బంధువులను సలహా అడుగుదామా అని చూడలేదు. అరుణాచలేశ్వరుడు పిలిచాడు, వచ్చాను. అది నా దేహప్రారబ్ధము. ఇప్పుడు నీవు అడుగుతున్నావు కాబట్టి చెపుతున్నాను. నీకులాగ అందరినీ సలహా అడిగి నేను అరుణాచలం రాలేదు అన్నారు భగవాన్. ఇల్లువిడిచిపెట్టి వెళ్ళే ప్రారబం నీ దేహానికి ఉంటే నీవు ఇటువంటి ప్రశ్నలు అడగవు. ప్రారబ్దంలో ఉంటే నాతో చెప్పకుండానే వెళ్ళిపోతావు. దేహం ప్రారబం ప్రకారం నడుస్తుంది. ఇల్లు విడిచివెట్టి వెళ్ళిపోవాలని తలంపు వచ్చినా నీ ప్రారబ్దంలో లేకపోతే వెళ్ళలేవు. నీ తలంపు, కోరికమాత్రం నీకు బలాన్ని ఇవ్వవు. ప్రారబం బలీయమైనది. ఇల్లు విడిచిపెట్టి వెళ్ళే ప్రారబ్దంలేకపోతే ఇల్లు విడిచిపెట్టాలనే తలంపుగాని, కోరికగాని నీకు వచ్చినప్పటికీ ఆ తలంపుకుగాని, కోరికకుగాని ప్రారబ్దాన్ని గెంటివేసే శక్తి లేదు. నీ తలంపులు, కోరికలు ప్రారబ్దంలో

కొట్టుకొనిపోవలసిందే. నీ ప్రారబ్ధం అతి వడిగా ఉన్నప్పుడు నీ నిగ్రహంకూడా ఆగదు అని గీతలో కృష్ణుడు చెప్పాడు. ఆ ప్రారబ్ధం మంచిది అయినప్పటికీ, చెడుది అయినప్పటికీ దానితో నీవు తాదాప్యం చెందకుండా ఉంటే నీవు అంతర్ముఖుడవు అవుతావు.

భగవాన్ దగ్గరకు వచ్చిన కొందరు ఈ ప్రపంచం ఏమైపోతుంది అని అడిగేవారు. నీవు పుట్టక ముందు ఈ ప్రపంచం ఉంది, నీవు చనిపోయిన తరువాతకూడా ఈ ప్రపంచం ఉంటుంది నీవు పుట్టకముందు ఈ ప్రపంచమును ఎవడైతే చూసాడో వాడే నీవు చనిపోయిన తరువాతకూడా చూస్తాడు. ఈ ప్రపంచం నీదీ కాదు, నాదీకాదు. దేవుడిది. అది తెగిపోయిన గాలిపటంలా లేదు. ఒక Higher power controlలో ఈ ప్రపంచం ఉంది అని చెప్పారు.

దేహంయొక్క చేష్టలు ప్రారబ్ధం ప్రకారం ఉంటాయి. దేహంతో తాదాప్యం చెందటం, చెందకపోవటం అనేది నీ చేతులలో ఉంది. నిర్ణయించుకొనే స్వేచ్ఛ భగవంతుడు నీకు ఇచ్చాడు. దేహంతో తాదాప్యం పొందితే కొత్తవాసనలు వస్తాయి, పాత వాసనలు పోవు. దేహంతో తాదాప్యం చెందకుండా ఉంటే పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు. దేహం ప్రారబ్ధం ప్రకారం ఈ లోకంలో తిరుగాడుతుంది. మరల జన్మ ఎలా వస్తుంది అని అడిగితే ఇప్పుడు నీవు ఎలా పుట్టావో రాబోయే జన్మలో కూడా అలాగే పుడతావు. అదిపారమార్థికసత్యంకాదు. ఈ పుట్టుకలు, చావటాలు, పుణ్యాపాపములు మనస్సు ఎంతనిజమో అవికూడా అంతే నిజం. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు. బ్రహ్మానుభవం పొందినవాడు మనస్సుచేత బంధింపబడడు. బ్రహ్మానుభవం పొందినవాడి మనస్సు కాలిపోయిన తాడువంటిది. కాలిపోయిన తాడు రూపానికి తాడులా ఉన్నా దానితో దేనిని బంధింపలేము. అలాగే జ్ఞానికి మనస్సు ఉన్నప్పటికీ అది మృతమనస్సు. ఆయన మనస్సుచేత బంధింపబడడు. నీవు ఇప్పుడు పుడితే రాబోయే జన్మగురించి అడుగవచ్చు. ఇప్పుడు నీవు పుట్టలేదు. జన్మలేనివాడికి పునర్జన్మ ఏమిటి? దేహం పుట్టింది. నీవు పుట్టలేదు. నీవు ఆత్మవు. రాబోయే జన్మల గొడవలు, పూర్వజన్మల గొడవలు అన్నీ నీ మనస్సులో ఉన్నాయి, నీ స్వరూపంలో లేవు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే చావు లేదు. పుట్టుకలేదు. ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు అది ఎవరు? అది నువ్వే. అక్కడకు కళ్ళు తెరవాలి. అక్కడకు మేల్కోవాలి.

నేను చనిపోయాను, నేను పుట్టాను అనుకోవటమే సంసారం. పుట్టుక లేనిది ఆత్మ. అది ఎవరు నీవే. అది నీకు అనుభవంలోనికి వచ్చినపుడు నీవు ఇంతవరకు ఎత్తిన వేలాది జన్మలు అన్నీ స్వప్నమాత్రం అని నీకు తెలుస్తుంది. స్వప్నంలో కనబడే దేహాలు ఎంత నిజమో నీకు బ్రహ్మానుభవం కలిగిన తరువాత నీవు ఎత్తిన వేలాది జన్మలు అన్నీకూడా అంతే నిజం అని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఇది సజీవమైన సత్యం. రాబోయే జన్మలగురించి నీవు ఆలోచిస్తున్నావు. నువ్వు ఎందుకు ఆలోచించటం. నీవు పుట్ట లేదు కదా. ఎవరైతే పుట్టాడో వాడిని ఆలోచించనియ్యి అంటున్నారు భగవాన్. నిన్ను ఆలోచించవద్దని నేను అనటం లేదు. ఎవడైతే పుట్టాడో వాడిని ఆలోచించనియ్యి, నువ్వు పుట్టలేదు కదా నీకు ఎందుకు అంటున్నారు.

నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు వ్యక్తమయితే నిగ్రహించుకోవటానికి మనస్సు అంటూ ఉండదు. నీవు ఎవడో నీకు తెలిసినపుడు సాధన చేయటానికి అంటే పూజలు, జపాలు, ధ్యానాలు చేయటానికి అక్కడ ఎవడూ ఉండడు. మీకు జపాలు చేయాలని సరదాగా ఉంది అనుకోండి. మీకు జ్ఞానం వచ్చింది అనుకోండి ఆజపం చేసే జపి లేకుండాపోతాడు. ఇంక జపం దేనితో చేస్తారు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీ జీవితగమ్యం. అది నీ హృదయంలో స్పష్టంగా ఉంది. దానిని తెలుసుకోవటంకోసం దానికి సంబంధించిన సామాగ్రిని నీవు సంపాదించుకో. దానికి సంబంధించిన సామాగ్రిని సంపాదించిన తరువాతకూడా దానిని తెలుసుకోవటం మానివేసి ఆ సామాగ్రిని పోగుచేసుకోవటమే పనిగా పెట్టుకుంటే అది సాధనకాదు అది లగరీ అన్నారు భగవాన్. ఎంతవరకూ విషయం తెలుసుకోవాలో అంతవరకూ తెలుసుకో. అది లగ్జరీకాదు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి కొంత నాలెడ్జి

నీకు అవసరమే. ఆ నాలెడ్జిని సేకరించాక నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటం మానివేసి ఇంకా అదనంగా నాలెడ్జిని నీ మనస్సుకు అందజేస్తూ ఉంటే అది సాధనకాదు, అది లగ్జరీ అంటున్నారు భగవాన్.)

నీవు ఇలు విడిచిపెట్టివెళ్ళిపోవాలంటే వెళ్ళిపో. పోనీ కాశీ వెళతావు. నీ ఇల్లు నీకూడా రాదు, పరిసరాలు రావు. నీ మనస్సు నీకూడా వచ్చేస్తుంది. నీవు దేనినైతే పోగొట్టుకోవాలో అది నీవు ఇల్లు విడిచిపెట్టినంతమాత్రంచేత అది పోదు. నీవు ఎక్కడికి వెళ్ళినా అది నీకూడా వచ్చేస్తుంది. నిజాన్ని మీరు ప్రాక్టీసు చేస్తే అది ఇప్పుడే ఇక్కడే నీకు తెలియబడుతుంది. ఈ జన్మలో నీవు చేయలేని పనిని వచ్చే జన్మలో చేస్తావని నిర్ధారణ ఎక్కడ ఉంది. ఈ రోజు చేయలేని పని రేపు చేస్తావని ఎక్కడ ఉంది. రేపుకు రూపులేదు. వర్తమానకాలం నీ చేతిలో ఉంది. దానిని సద్వినియోగం చేసుకో. అన్ని అవకాశములు ఉండగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందటానికి నీవు ప్రయత్నం చేయలేనప్పుడు అవకాశములు లేనప్పుడు నీవు చేస్తావని గ్యారంటీ ఏమిటి అంటున్నారు భగవాన్. చేయలేవు. మనస్సు అలా వాయిదాలు వేస్తుంది.

మీరు గృహంలో ఉన్నా ఇబ్బంది లేదు. గృహాన్ని విడిచిపెట్టేసినా ఇబ్బంది లేదు. గృహంలో ఉన్నా గృహాన్ని విడిచిపెట్టినా పోగొట్టుకోవలసినది ఒక్కటే. అహంభావనను పోగొట్టుకోవాలి. నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి ఇలు అడ్డురావటంలేదు, అడవి అడ్డు రావటం లేదు. పరిసరాలు తేడా అంతే. ఇంట్లో ఉన్నా, అడవిలోనికి వెళ్ళినా పోగొట్టుకోవలసినది అహంభావననే. ఇంటో ఉండగా పోగొట్టుకోలేనిది అడవిలోనికి వెళ్ళి పోగొట్టుకొంటావని ఏమైనా గ్యారంటీ ఇవ్వగలవా. నీ మనస్సు అలా మాయ చేస్తుంది అంతే. ఇంటిదగ్గర ఉన్నంతసేపు నేను గృహస్థుడను అనుకొంటాడు. ఇలు వదలి ఎవరో గురువును ఆశ్రయిస్తాడు. ఎర్రబట్టలు కట్టుకొంటాడు. నేను సన్యాసిని అనుకొంటాడు. అప్పుడూ ఆత్మభావన ఉండదు, ఇప్పుడూ ఆత్మభావన ఉండదు. తలంపు మారింది అంతే. ఇదే మాయ. నీవు సన్యాసం పుచ్చుకొన్నా, గృహస్థాశ్రమంలో ఉన్నా నీకు బ్రహ్మానుభవం పొందటంకోసం ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో అవి తొలగించుకో. గృహస్థుడిగా ఉన్నా ఆటంకాలను తొలగించుకొంటే బ్రహ్మానుభవం కలుగుతుంది. ఒకోసారి పరిసరాలు మారటంవలన బాగుపడము సరికదా పాడైపోతాము. పరిసరాలు మారినంతమాత్రంచేత, బట్టలు మారినంతమాత్రంచేత బ్రహ్మానుభవం వచ్చేస్తుంది అని ఊహించుకోవద్దు. పరిసరాలు మార్చినంతమాత్రం చేత కొత్తపరిసరాలు నీకు ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరిస్తాయి అని చెప్పలేము. అందువలన పరిసరాలు మార్చినంతమాత్రంచేత నీకు జ్ఞానం వచ్చివేయదు.

ఈ దేహమునాది అని నీ అహంభావనే చెపుతోంది. ప్రపంచాన్ని కల్పించేదికూడా నీ అహంభావనే. నేను గృహస్థుడను అని చెప్పేదికూడా నీ అహంభావనే. ఆత్మచెప్పటం లేదు. ఈ గొడవలన్నీ కల్పించేది నీ అహంభావనే. ఏదైతే నీవు పోగొట్టుకోవాలో అదే ఈ గొడవలన్నీ కల్పిస్తోంది. ఆటంకము అంతా నీ అహంభావనే. నీవు ఏ పరిసరాలలో ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఏ జాతిలో ఉన్నా అహంభావనను తొలగించుకోవాలి. డైరక్టుగా అహంభావనను తొలగించుకోవటానికి మనం ప్రయత్నం మొదలుపెడతాము అనుకోండి. మనస్సు ఏమిచేస్తుంది అంటే ఇక్కడకంటే కాశీలో బాగా సాధన చేసుకోవచ్చు అని ఇలా ఆలోచిస్తుంది. పరిసరాలు మార్చమని చెపుతుంది. కాని అహంభావనను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయము. మాయ అంతా మనస్సులోనే ఉంది. మీ ఇంటిదగ్గర మీరు normalగా ఉంటారు, naturalగా ఉంటారు. చుట్టాలు ఇంటిదగ్గర normalగా ఉండలేరు. మీ ఇంటిదగ్గర మీరు ఎంత normalగా ఉంటారో అలాగ మీ మనస్సును మీ హృదయంలో అంత normalగా, అంత naturalగా ఉంచితే మీ మనస్సు హృదయంలో కరిగిపోతుంది. మనస్సు హృదయంలో ఎప్పుడైతే కరిగిపోయిందో మనస్సుయొక్క మూలంలోని సద్వస్తువు నీకు నేనుగా వ్యక్తమవుతుంది. అది చివరిస్థితి, అది పరమస్థితి.